నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 30 మార్చి 2025 | HYDERABAD


## మెట్రో రైళ్ల సమయం పొడిగింపు



సిటీబ్యూరో: నగరంలో మెట్రో సమయాన్ని మరో 45 నిమిషాల పాటు పొడిగించారు. ఏప్రిల్ 1 నుంచి రాత్రి 11.45 వరకు మెట్రో సేవలు అందుబాటులో ఉంటాయని మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా మెట్రో స్టూడెంట్ పాస్ ఆఫర్‌ను మరో ఏడాది పొడిగించగా, 2026 మార్చి 31 వరకు ఈ స్కీం అందుబాటులో ఉందన్నారు. ఈ ఆఫర్ ద్వారా 20 ట్రిప్పులకు చెల్లించి 30 ట్రిప్పులను పొందే వీలు ఉందన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లకు ఉచిత నల్లా కనెక్షన్లు



స్కూళ్లలో ఉచిత నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మర్రికి వినతి పత్రం ఇస్తున్న అధికారులు

మల్కాజిగిరి: ప్రభుత్వ స్కూళ్లకు ఉచిత నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో స్కూళ్లలో నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేయాలని అధికారులు వినతి పత్రం అందజేశారు.నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లలో ఉచిత నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.

# గరీబోళ్ల ఇండ్లు కూల్చితే ఏమొస్తది?

చంటిపిల్లలతో చిన్న రేకుల ఇంటిలో ఉంటున్నాం
రెక్కల కష్టంతో బతికేటోళ్లం..నిల్వనీడలేకుండా చేస్తారా..

జవహర్‌నగర్‌లో అక్రమ కట్టడాల పేరిట పేదల ఇండ్ల కూల్చివేత
కన్నీరుమున్నీరైన బాధితులు..ప్రభుత్వానికి శాపనార్థాలు



పేదల ఇంటిని బుల్డోజర్‌తో కూల్చివేస్తున్న దృశ్యం



మా ఇల్లు కూల్చితే... చంటిపిల్లలతో ఎక్కడ ఉండాలంటూ రోదిస్తున్న మహిళ

జవహర్‌నగర్, మార్చి 29: 'సారూ... మా గరీబోళ్ల ఇండ్లు కూల్చితే ఏమోస్తాది? కూలీనాలీ చేసి పస్తులుండి చిన్న రేకుల ఇంటిని నిర్మించుకుని జీవిద్దామనుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మా పేదలపైనే ఉగ్రరూపం చూపటం ఏంటి..' అని జవహర్‌నగర్ వాసులు కన్నీరుమున్నీరయ్యారు. రెక్కల కష్టంతో పనిచేసి నాలుగు గోడలతో రేకులు వేసుకుని చంటిపిల్లలతో పాములు, దోమల మధ్య నివసిస్తుంటే.. ప్రభుత్వం మాపై దయచూపకుండా నిలువ నీడలేకుండా చేయడం ఇందిరమ్మ రాజ్యానికే చెల్లుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాప్రా తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని అక్రమ కట్టడాల పేరిట పేదల నివాసాలను రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సాయంతో శనివారం కూల్చివేతలు చేపట్టారు. కార్పొరేషన్‌లోని అంబేద్కర్‌నగర్, బీజేఆర్‌నగర్, సంతోషన్‌నగర్, లక్ష్మీనర్సింహాస్వామి కమాన్ ఎదురుగా నిర్మించిన కట్టడాలను అక్రమంటూ పోలీసులతో ఇండ్లలో ఉన్న మహిళలను, సామాన్లను బయటకు లాగీ కూల్చివేయడంతో మహిళలు బోరున విలపించారు. అంబేద్కర్‌నగర్, బీజేఆర్‌నగర్‌లో ఇండ్ల మధ్య ఉన్న రేకుల ఇంటిని కూలగొట్టి స్లాబ్ వేసుకుందామని పిల్లర్లు వేయగా నిర్ధాక్షిణ్యంగా కూల్చివేయడంతో రూ. 5లక్షల మేరకు నష్టపోయామంటూ బాధితులు ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. జవహర్‌నగర్‌లో 20 ఏండ్ల నుంచి నివసిస్తూ, ఇంటి, నల్లా ట్యాక్సీలు ప్రభుత్వానికి చెల్లిస్తుంటే మా ఇంటి ఎలా కూలగొడతారంటూ రెవెన్యూ యంత్రాంగానికి ప్రజలు ప్రశ్నించారు. 'చిన్నపిల్లలు ఉన్నారు... ఇంటిని కూల్చుతానంటే మేమేలా బతకాలి' అంటూ ఓ మహిళ పోలీసులను ప్రాధేయపడినా.. వినకుండా ఇంటిని కూల్చివేశారు.

### 30 ఏండ్ల కిందట..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 30 ఏండ్ల కిందట నిర్మితమైన కాలనీలోకి రెవెన్యూ అధికారులు వెళ్లి అక్రమ నిర్మాణాలంటూ.. కూల్చడంతో బాధితులు ప్రభుత్వంపై మండిపడ్డారు. కరెంటు, 'వాటర్, ఇంటి పన్నులు చెల్లిస్తున్నాం.. ప్రభుత్వం మాపై కనికరం చూపకుండా కూల్చడం దుర్మార్గం' అంటూ రోదించారు.

### రెక్కల కష్టంపై ఆధారపడి బతికేటోళ్లం

'రెక్కల కష్టంపై ఆధారపడి బతికేటోళ్లం. చిన్న పిల్లలతో కిరాయి ఇండ్లలో ఎన్నిరోజులు కాలం వెళ్లదీస్తామంటూ చిన్న పాటి రేకుల రూం కట్టుకున్నాం. రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణామంటూ పూర్తిగా నేల మట్టం చేయడంతో దిక్కుతోచని వాళ్లయ్యాం. ' అని అశ్విని అనే మహిళ కన్నీరుమున్నీరయ్యారు. పిల్లలతో కలిసి ఎక్కడ నివాసముండాలని కన్నీరు పెట్టడం ప్రతి ఒక్కరినీ కలిచివేసింది.



## పండగపూట.. సిటీ బస్సులే ఎక్స్‌ప్రెస్‌లంట..!

ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్న ఆర్టీసీ
రూ.200ల టికెట్‌ను రూ.290 వసూలు

సిటీబ్యూరో, మార్చి 29 ( నమస్తే తెలంగాణ ): దిల్‌సుఖ్‌నగర్ నుంచి సూర్యాపేటకు ఎక్స్‌ప్రెస్ బస్సు టికెట్ ధర రూ. 200లు ఉంటుంది. అయితే పండుగ దృష్ట్యా ఆ ధరను 290కి పెంచారు. పెంచితే పెంచారేమో గానీ అది నిజంగానే ఎక్స్‌ప్రెస్ బస్సు అయితే ప్రయాణికులు కొంత అంగీకరించేవారేమో. కానీ నగరంలో తిరుగుతున్న సిటీ బస్సును పండుగ పూట ఎక్స్‌ప్రెస్ అంటూ బోర్డు తగిలించి ఎక్స్‌ప్రెస్ బస్సు ధరలకు మించి డబ్బులు వసూలు చేయడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేందని అడిగితే బస్సు దిగిపో అని కండక్టర్లు బెదిరిస్తున్నారని రవి అనే ప్రయాణికుడు చెప్పాడు.

### బస్సులు పెంచకుండా ..!

గ్రేటర్ ప్రయాణికులకే ఇక్కడ నడిచే బస్సులు సరిపోవడం లేదు. సాధారణంగా గ్రేటర్‌లో ఉచిత బస్సు అమలుకు ముందున రోజుకు 11 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేసేవాళ్లు. ఇందులో మహిళా ప్రయాణికులు 5 లక్షల మంది ఉండేవాళ్లు. కానీ మహాలక్ష్మి ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చాక ఇప్పుడు రోజుకు సుమారు 24 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. ఇందులో 17 లక్షల మంది మహిళలే ఉండటం విశేషం. ఒక్క రోజుకు ఇంత మంది ప్రయాణం కేవలం గ్రేటర్‌లో ఉన్న 2600 బస్సులపైనే ఆధారపడి ఉంది. దీంతో ప్రతీ బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్టీసీ సిటీ బస్సులను జిల్లాలకు ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో తిప్పడంపై విమర్శలు వస్తున్నాయి.



## విద్యార్థుల నిరసన దీక్ష



ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో అప్రజాస్వామికంగా జారీ చేసిన సర్క్యులర్ ను వెనక్కి తీసుకోవాలని వర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ఓయూ పూర్వ విద్యార్థి నాయకులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తుంగ బాలు సంఘీభావం తెలిపారు. ఉస్మానియాలో నిరసన చేసే హక్కుని కాలరాయడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు.

## హెచ్‌సీయూలో తీవ్ర ఉద్రిక్తత

**పోలీసుల దాడిలో విద్యార్థులకు గాయాలు**
**స్పృహతప్పి పడిపోయినకొందరు**
**మరికొందరికి గాయాలు**

II

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ): సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు జులూం ప్రదర్శించారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు హెచ్‌సీయూ విద్యార్థులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా స్టూడెంట్స్ యూనియన్ శనివారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుని దాడి చేశారు. యూనివర్సిటీ గేటు ముందు నుంచి విద్యార్థులను లోపలికి నెట్టుకెళ్లారు. అడ్డుకున్న విద్యార్థులపై పోలీసులు దాడికి తెగబడటంతో కొందరు కింద పడి స్పృహ తప్పి పడిపోయారు. మరికొందరు విద్యార్థులు గాయపడ్డారు.



## ఆస్తి పన్ను కడతలేరని.. డ్రైనేజీ బంద్ చేసి..

దుండిగల్,మార్చి29: నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 15,16వ డివిజన్ల లోని రాజీవ్ గాంధీ నగర్ లో పలు ఇండ్లకు శనివారం స్థానికులు ఆస్తి పన్ను చెల్లించడం లేదంటూ మున్సిపల్ అధికారులు ఏకంగా డ్రైనేజీ పైప్‌లైన్ మూసివేశారు. దీంతో స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పన్నులు కట్టకుంటే ప్రజలకు అందాల్సిన కనీస వసతులను నిలిపివేస్తారా...? ఇదేం తీరు అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబీర్‌అలీని వివరణ కోరగా... గడిచిన నెల రోజులుగా పనులు చెల్లించాలని వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నామని, ఆటోలను ఏర్పాటు చేసి పన్నులు చెల్లించాలని కోరుతున్నా.. ఎవరూ స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ విధానం ప్రకారమే తాము నడుచుకుంటున్నామని పేర్కొన్నారు.





## కాల్పుల కలకలం..

కార్వాన్: గుడిమల్కాపూర్‌లో కింగ్‌ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ ఎక్స్‌పో పేరుతో పలు రకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఫర్‌ఖాన్ అహ్మద్, సయ్యద్ హరున్ బొమ్మల దుకాణం ఏర్పాటు చేయగా, వీరి పక్కనే తౌఫిక్ పెర్ఫ్యూమ్ దుకాణాన్ని పెట్టాడు. శుక్రవారం ఫర్‌ఖాన్ ఓ పెర్ఫ్యూమ్ బాటిల్‌ను ఉచితంగా ఇవ్వాలని తౌఫిక్‌ను కోరగా, అతడు నిరాకరించాడు. ఫర్‌ఖాన్ తన అనుచరులతో కలిసి గొడవకు దిగాడు. ఎక్స్‌పో ముఖ్యనిర్వాహకుడైన ఆసిఫుద్దీన్ ఇరువురికి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. తనపై దాడి చేస్తారేమోనని ఆందోళన చెందిన ఆసిఫుద్దీన్ తన లైసెన్స్‌డ్ రివాల్వర్ తీసి..గాలిలోకి రెండు సార్లు కాల్పులు జరిపాడు. పోలీసులు ఆసిఫుద్దీన్‌ను అదుపులోకి తీసుకొని, రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

### సన్నబియ్యం నిలిపివేత

సిటీబ్యూరో జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున హైదరాబాద్‌లో సన్నబియ్యం పంపిణీ చేయడం లేదని, సన్న బియ్యం బదులు దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## గెజిట్ వచ్చే వరకూ.. గ్రామ పంచాయతీలే

### ఆ 34 గ్రామాలపై అధికారుల ప్రత్యేక దృష్టి

మేడ్చల్, మార్చి29(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లాలో మరో మూడు మున్సిపాలిటీలను ఏర్పాటు చేస్తూ అసెంబ్లీలో బిల్లు పాసైన నేపథ్యంలో 34 గ్రామాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న భూములకు డిమాండ్ ఉంది. అయితే మూడు మున్సిపాలిటీలను ఏర్పాటు చేసి 34 గ్రామాలను కలుపుతున్నారు. దీంతో ఏదైనా నూతన అనుమతులు, ట్యాక్స్‌లకు సంబంధించిన విషయాలపై అవకతవకలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. జిల్లాలో మరో మూడు మున్సిపాలిటీలుగా అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్‌లు మారనున్నాయి. ప్రస్తుతానికి మున్సిపాలిటీలుగా అసెంబ్లీలో బిల్లు అమోదం పొందినప్పటికీ గెజిట్ వచ్చే వరకు గ్రామపంచాయతీలుగానే కొనసాగనున్నాయి. జిల్లాలో 61 గ్రామాలు ఉండగా గతేడాది సెప్టెంబర్‌లో 28 గ్రామాలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేసిన విషయం తెలిసిందే. మున్సిపాలిటీలుగా ఏర్పడనున్న అలియాబాద్ మున్సిపాలిటీలో 7 గ్రామ పంచాయతీలు మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో 13, ఎల్లంపల్లి మున్సిపాలిటీలో 14 గ్రామ పంచాయతీలు కలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 మున్సిపాలిటీలు ఉండగా మరో మూడు మున్సిపాలిటీలు ఏర్పడుతున్న నేపథ్యంలో జిల్లాలో 16 మున్సిపాలిటీలు కానున్నాయి.



రామోజీ ఫిలిం సిటీలో ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య తదితరులు

## ఎండలతో జాగ్రత్త



**పొంచి ఉన్న వడ దెబ్బ ముప్పు**
**ఎండలో తిరిగేవారు రక్షణ చర్యలు తీసుకోవాలంటున్న వైద్యులు**

సిటీబ్యూరో: మార్చి నెలలోనే ఎండలు ముదురడంతో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం నగరంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. 42 నుంచి 44వరకు చేరుకునే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే పెరుగుతున్న ఎండ తీవ్రత వల్ల నగరంలో వడ దెబ్బ బాధితుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా నవజాత శిశువులు, ఐదేండ్ల లోపు చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు బీపీ, షుగర్, కిడ్నీ, కాలేయ, గుండె, క్యాన్సర్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### చికిత్స చేయించాలి..



వడదెబ్బకు గురైన వారు.. ఎండలో తిరిగి మూర్ఛపోయిన వారిని వెంటనే చల్లటి ప్రదేశానికి తరలించాలి. ముఖంపై స్వచ్ఛమైన నీటిని చల్లి, స్పృహ వచ్చిన తరువాత నెమ్మదిగా కొంత చల్లటి మంచినీరు తాగించాలి. వెంటనే దగ్గరలో ఉన్న దవాఖానకు తరలించి చికిత్స చేయించాలి.

*– డా.కిరణ్ మాదాల, గాంధీ దవాఖాన క్రిటికల్ కేర్ నిపుణులు*

### కాటన్ దుస్తులు వేయాలి..



మధ్యాహ్నం సమయంలో పిల్లలను తీసుకుని తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే వాహనాలను ఆశ్రయించడం ఉత్తమం. పిల్లలకు కాటన్ దుస్తులు మాత్రమే వేయాలి. నవజాత శిశువులతో పాటు మూడేండ్ల లోపు శిశువులకు తరచూ తల్లిపాలు పట్టాలి. ఎక్కువగా ద్రవ పదార్థాలు ఇవ్వడం మంచిది.

*– డా.ఉషారాణి, ప్రొఫెసర్ ఆఫ్ పిడియాట్రిక్, నిలోఫర్ హాస్పిటల్*

## రాజకీయ ఉనికి కోసమే బీజేపీ నేతల దీక్ష

**మీర్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి**

బడంగ్‌పేట, మార్చి 29: మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భారీగా పెరిగిన ఆస్తి పన్నులను తగ్గించాలని మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి ఆదేశాల మేరకు మీర్ పేట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు శనివారం సీడీఎంఏకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామేష్ రెడ్డి మాట్లాడుతూ మీర్ పేట కార్పొరేషన్ కమిషనర్‌కు అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చామని, త్వరలో ఆస్తి పన్ను సమస్యను పరిష్కరిస్తామని అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. ఎమ్మెల్యే స్వయంగా ఫోన్లు చేసి పేద మధ్యతరగతి ప్రజలకు సంబంధించిన ఆస్తి పన్ను తగ్గించాలని అనేక సార్లు అధికారులకు చెబుతూనే వస్తున్నారన్నారు. ఏ రోజు కూడా ప్రజల సమస్యలను పట్టించుకోని బీజేపీ నాయకులు.. ఆస్తి పన్ను తగ్గిస్తే బీఆర్ఎస్‌కు ఎక్కడ పేరు వస్తుందోనని.. రాజకీయ ఉనికి కోసం రిలే నిరాహార దీక్షలకు దిగారని, వారి నిరసనకు కాలనీవాసుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు.

## ప్రవీణ్ పగడాల హత్యపై సీబీఐతో విచారణ జరిపించాలి

ఖైరతాబాద్: పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యోందంపై సీబీఐతో విచారణ జరిపించాలని వక్తలు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ మాట్లాడుతూ... ప్రవీణ్ పగడాల మరణం సాధారణమైంది కాదని, అది ముమ్మాటికీ హత్యేనన్నారు. ఆయన మరణించి మూడు రోజులు గడిచినా ఇంత వరకు పోస్టుమార్టం రిపోర్టు రాలేదన్నారు. నిజం కోసం కొట్లాడుతున్న న్యాయవాది ఇజ్రాయల్‌ను సైతం హత్య చేశారని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాలక ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. విశ్రాంత డీజీపీ బాబురావు మాట్లాడుతూ ప్రవీణ్‌ది ప్రమాదమా, లేక హత్య అనేది తేలాల్సి ఉందని, కాని 90 శాతం మంది ఇది హత్యేనని భావిస్తున్నారన్నారు. కొంత కాలం నుంచి ఆయనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని చెప్పారని, ప్రవీణ్ పగడాల, ఆయన కుటుంబ సభ్యుల కాల్ డేటా వివరాలను పోలీసులు సేకరించి విచారణ చేపట్టాలన్నారు. కావేటి లా ఫర్మ్ ప్రతినిధి న్యాయవాది రాజేందర్, జేరుషలేం మత్తయ్య పాల్గొన్నారు.

